క్లుప్తంగా

నేడు మాచర్ల నియోజకవర్గ క్రికెట్ జట్టు ఎంపిక

కారెంపూడి: వచ్చే నెల 4న పల్నాడు జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించతలపెట్టిన కలెక్టర్ ట్రోఫీ క్రికెట్ పోటీలలో పాల్గొనేందుకు మాచర్ల నియోజకవర్గ క్రికెట్ జట్టు ఎంపిక దుర్గి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సోమవారం జరుగుతుందని జట్టు ఇన్‌చార్జిగా నియమితులైన స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ పీడీ రత్తయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు తమ ఆధార్‌కార్డ్ జిరాక్స్ తీసుకుని ఎంపికకు హాజరు కావాలని కోరారు. నియోజకవర్గంలోని సీనియర్ పీఈటీ, పీడీలు బండ్ల ప్రసాద్, అనిల్, వేణు, శ్రీనివాసరావు, ఎక్స్‌మస్ జాన్, స్వర్ణరాజు ఎంపికలో పాల్గొంటారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలలోని ఏడు నియోజకవర్గాల జట్ల మధ్య ఈ నెల 29న నరసరావుపేటలోని క్రికెట్ స్టేడియంలో కలెక్టర్ ట్రోఫీ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులతోపాటు కలెక్టర్ ట్రోఫీలు అందిస్తారని తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన వారు 98493 86761, 8790663512 నంబర్లను సంప్రదించాలని పీడీ రత్తయ్య కోరారు.

చిరకాల సమస్యకు పరిష్కారం



కారెంపూడి: చాలా కాలంగా సమస్యాత్మకంగా ఉన్న కారెంపూడి కాష్టాల గడ్డలోని హై టెన్షన్ విద్యుత్ లైన్‌ను అక్కడ నుంచి తొలగించి దాచేపల్లి వెళ్లే రోడ్డు పక్కన ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ శాఖ సిబ్బంది, కాంట్రాక్టు కార్మికులు శ్రమించి నూతన లైన్ వేశారు. చాలాకాలంగా నివాసాల మీదుగా 11కేవీ లైన్ వెళ్తుండడంతో కాష్టాల గడ్డవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో ఎట్టకేలకు స్పందించిన విద్యుత్ శాఖ మండల ఏఈ సీహెచ్ కోటేశ్వరరావు పర్యవేక్షణలో పనులు శరవేగంగా జరిగాయి. రెండు దశాబ్దాలుగా ఉన్న సమస్యను పరిష్కరించారు.

శ్రీరామనవమి ఉత్సవాలు



మాచర్ల: స్థానిక శ్రీశైలం రోడ్డులోని కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం మూడో రోజు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పీటల మీద కూర్చుని పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు ఆలయ కమిటీ అధ్యక్షులు విడేల సుందరరావు, కార్యదర్శి చిల్లంచర్ల సత్యనారాయణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు మరువలేనివి

గురజాల: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు మరువలేనివని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు చెప్పారు. నగర పంచాయతీలోని వెంకట్రావు నగర్‌లో ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గనిరాజు మాట్లాడుతూ స్వాతంత్య్ర వీరుల త్యాగాలను గుర్తుచేశారు. అనంతరం సాయంత్రం కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.పోతురాజు, నాయకులు నభి, అప్పారావు, శ్రీను, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

యాచకుడు మృతి

గురజాల : భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. పెదకూరపాడు లింగంగుట్లకు చెందిన చిన్న బత్తుల ప్రకాశం (70) దాచేపల్లి పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ ఈనెల 20న తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో స్థానికులు గురజాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ 25వ తేదీ సాయంత్రం అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బంధువులు ఉంటే గురజాల, దాచేపల్లి పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

మాచవరం: గడ్డి మందు తాగిన విద్యార్థి చికిత్స పొందుతూ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పిన్నెల్లి గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి ధనుష్‌రెడ్డి (16) పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 5న ట్యూషన్‌కు వెళ్లమని తల్లి లక్ష్మి మందలించడంతో మనస్థాపంతో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. అయినా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తల్లి లక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

● మాతా.. శుభోనమో..



పిన్నెల్లి గ్రామంలోని కాళికామాత ఆలయంలో ఆదివారం రెండోరోజు పుష్కర కుంభాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మాతా.. శుభో నమో అంటూ నినదించారు. గ్రామంలోని శివాలయం నుంచి మహిళలు, భక్తులు బోనాలతో మేళతాళాల మధ్య భారీ ఊరేగింపుగా కాళికాదేవి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మూలమూర్తికి పవిత్ర నదీజల పూరితములైన అష్టోత్తర శతకలశాభిషేకం చేశారు. వేద పండితులు అమ్మవారికి సుప్రభాతం, నిత్యనిధి, మంటప దేవతా హోమాలు, చండీ, మహా విద్య పారాయణం నిర్వహించారు. సోమవారం నాడు దేవాలయ పుష్కర కుంభాభిషేక మహోత్సవం, మహా అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు యరవెద బ్రదర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు. – మాచవరం

● నిఘారింపు



దాచేపల్లి నగర పంచాయతీ సీసీ కెమెరాలతో నిగారిస్తోంది. పోలీసు శాఖ ప్రధాన కూడళ్లలో 32కిపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. సీఐ షేక్ బిలాలుద్దీన్ ఆధ్వర్యంలో పనులు జరిగాయి. ఈ కెమెరాలను పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి నిత్యం పర్యవేక్షిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ముత్యాలంపాడు రోడ్డులోని అద్దంకి–నార్కెట్‌పల్లి హైవే వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు పనులను చిత్రంలో చూడొచ్చు. ఇదిలా ఉంటే పొందుగల, తంగెడ సమీపంలోని రాష్ట్ర సరిహద్దుల వద్ద ఉన్న చెక్ పోస్టుల్లోని సీసీ కెమెరాలను పోలీస్‌స్టేషన్లకు అనుసంధానం చేశారు. – దాచేపల్లి

● చదువుల పెన్నుధి



పిడుగురాళ్ల పట్టణంలోని నాగులు గుడి దేవస్థానంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సరస్వతి అమ్మవారిని పెన్నులు, పుస్తకాలతో విశేషంగా అలంకరించారు. ఆలయ పూజారి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి పులకించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. – పిడుగురాళ్ల

పేదలందరికీ ఆరోగ్య భరోసా సీఎం లక్ష్యం

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: పేదలందరికీ ఆరోగ్య భరోసా అందించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) చెప్పారు. మాచర్ల నియోజకవర్గంలో అనారోగ్యానికి గురైన ఇద్దరు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.1.80 లక్షల విలువైన చెక్కులను పీఆర్కే తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.3 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్టు వివరించారు. ప్రస్తుతం గుండా రోశయ్యకు రూ.1,20,000, మూలంరెడ్డి జయమ్మకు రూ.60,000 మంజూరైనట్టు వెల్లడించారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన అవసరం

రెంటచింతల: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే గ్రామీణ విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని యూటీఎఫ్ శాఖ రాష్ట్ర నాయకులు ఆర్.సాల్మన్‌రాజు చెప్పారు. ఆదివారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాబాయి స్ఫూర్తితో తీసుకువచ్చిన అంతరిక్ష విజ్ఞానం పుస్తకంపై మండల స్థాయి విశాట్–2023 పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ ప్రజల జీవితాలలో సైన్స్ ఒక భాగమని పేర్కొన్నారు. పరీక్షలలో సీనియర్ విభాగంలో ఎస్.సంగీత, ఎ.శివ ప్రథమ, ద్వితీయ, కె.హారిక, కె.కల్పన, జి.మేరి హెప్సిబా తృతీయ బహుమతులు గెలుపొందారు. జూనియర్ విభాగంలో షేక్ హుసేన్, పి.సాయి స్లోకా, వి.రాగిణి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పొందారు. అనంతరం ఇటీవల మరణించిన పాల్వాయి నాగిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ ఎం.బి.చిన్నమ్మ, నరమాల హనుమంతురావు, ఆర్.సాల్మాన్‌రాజు విజేతలకు బహుమతులను అందజేశారు.



విజేతలతో యూటీఎఫ్ సంఘం నేతలు, ఉపాధ్యాయులు

వైభవంగా తిరునాళ్ల

గురజాల : అంబాపురం గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల, పోలేరమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. మధ్యాహ్నం అన్నప్రసాదం వితరణ నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వార్లను ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పాటకచేరీలు ఆకట్టుకున్నాయి. స్వామిని గ్రామ సర్పంచ్ పాశం హేమలత, పాశం హనిమిరెడ్డి, జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరావు, వేలమూరి సైదారెడ్డి, పాశం పాపిరెడ్డి, ఆనం వెంకటప్పారెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

● మాడుగుల గ్రామంలోని అలివేలు మంగ పద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్వామి దేవేరులను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, మురారి, సర్పంచ్ గనిపల్లి దానమ్మ, మాజీ సర్పంచ్ బండ్ల వెంకయ్య, మాచర్ల బాబు, గనిపల్లి సాగర్ బాబు, అమావాస్య నాగేశ్వరరావు, కె.ఆంజనేయులు తదితరులు దర్శించుకున్నారు.

● పులిపాడులో రజకుల ఆరాధ్య దైవం మడేలయ్య స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన కోలాటం ఆకట్టుకుంది. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. స్వామి కల్యాణాన్ని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), కొమ్మినేని రవిశంకర్, రజక సంఘం నాయకులు తిలకించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తుమ్మకోట(రెంటచింతల): వృత్తిరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా మళ్లీ ఆ చదువులమ్మ ఒడిలో కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రోజంతా హుషారుగా గడిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993, 1998లలో 10వ తరగతి చదివినవారు ఆదివారం పాఠశాలలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పోట్ల రామకృష్ణ అధ్యక్షతన సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆహ్లాదంగా గడిపారు. బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హెచ్ఎం కాసు శౌర్రెడ్డి, ఆనాటి ఉపాధ్యాయులతోపాటు ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను దుశ్శాలువాలు, పూలమాలలతో పూర్వ విద్యార్థులు సన్మానించారు.



పూర్వవిద్యార్థులు

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల స్వచ్ఛభారత్

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం విజయపురి సౌత్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఏపీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణ, లాంచీస్టేషన్, అంబేడ్కర్ సెంటర్ ప్రాంతాలలో చెత్తాచెదారాన్ని, రహదారులకు ఇరువైపులా ఉన్న ముళ్ళచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్కే మహమ్మద్ బాష, విద్యార్థులు పాల్గొన్నారు.



శరవేగంగా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణ పనులు

సొసైటీ చైర్మన్ చెన్నయ్య

శావల్యాపురం: వేల్పూరు గ్రామంలో రూ.6 కోట్ల వ్యయంతో నాబార్డు, కేంద్ర వ్యవసాయ సహకార సొసైటీ సారథ్యంలో నిర్మిస్తున్న శీతలగిడ్డంగి (కోల్డ్ స్టోరేజ్) భవనం పనులు తుది దశకు చేరాయి. ఈ సందర్భంగా శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నేతృత్వంలో 3 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన శీతల గిడ్డంగి భవన నిర్మాణ పనులు పూర్తికాగా మిషనరీ పనులు త్వరితగతిన సాగుతున్నాయని తెలిపారు. 1,000 మెట్రిక్ టన్నుల గోదాము పనులు కూడా రూ.75 లక్షల వ్యయంతో జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాద్ తదితరులు ఉన్నారు.



వేల్పూరులో నిర్మాణ దశలో ఉన్న కోల్డ్ స్టోరేజ్ కేంద్రం

చట్ట వ్యతిరేక పనులకు దూరంగా ఉండాలి



తుమ్మకోట గ్రామస్తులకు పలు సూచనలు చేస్తున్న ఎస్ఐ సయ్యద్ షమీర్‌బాష

తుమ్మకోట(రెంటచింతల): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సయ్యద్ షమీర్ బాష ప్రజలకు సూచించారు. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురజాల డీఎస్పీ బెజవాడ మెహర్ జయరామ్ ప్రసాద్ సూచనలతో ఆదివారం మండలంలోని తుమ్మకోట గ్రామంలో కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ఎస్ఐ సయ్యద్ బాష మాట్లాడుతూ తెలంగాణ మద్యం, గుట్కాలు, అమ్మడం, సరఫరా చేయడం నేరమని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. లోన్ యాప్‌ల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరస్తులకు వ్యక్తిగత వివరాలు చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలునాయక్, గ్రామ పెద్దలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పేద విద్యార్థి చదవాలన్నదే సీఎం జగన్ లక్ష్యం

మాచర్ల: ప్రతి పేద విద్యార్థీ చదవాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం రామాటాకీస్‌లైన్‌లో జరిగిన ఓ ప్రైవేటు విద్యా సంస్థ ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగం బలోపేతానికి సీఎం ఎన్నో విప్లవాత్మక చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని పేద విద్యార్థులు చక్కగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వైఎస్సార్ సీపీలో చేరిక



రాజశేఖర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు కొండమీది రాజశేఖర్ స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేసేవారికి మంచి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బాలురామయ్య, సొసైటీ చైర్మన్ పారా వెంకటేశ్వర్లు, దగ్గుపాటి మూర్తెయ్య, సర్పంచ్‌లు లేళ్ల వెంకటేశ్వర్లు, కంచర్ల బాబు, కోపెల దేవరాజ్, జెడ్పీ కో–ఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, ములకా రామతులసీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన శ్రీనివాస్

విజయపురిసౌత్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మాచర్ల మండలం పశువేముల గ్రామ సమీపంలోని సూరమ్మ చెరువు వద్ద ఆదివారం జరిగింది. పశువేముల గ్రామానికి చెందిన బెజవాడ శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై మాచర్ల వైపు వెళ్తున్నాడు. సూరమ్మ చెరువు సమీపంలోకి రాగానే సరిగ్గా అదే సమయంలో మాచర్ల నుంచి విజయపురిసౌత్ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ కుడికాలు, ఎడమకాలు పాదం వద్ద విరిగిపోయాయి. క్షతగాత్రుడిని మాచర్ల ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం పల్నాడు జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ ప్రజల క్షేమం కోసం..

రూ.10 లక్షలతో పైపులైన్ల ఏర్పాటుకు చర్యలు

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని 1వ వార్డులో తాగునీటి సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టారు. దీర్ఘకాలంగా ఎస్సీ కాలనీ వాసులు మంచినీటి కోసం పడుతున్న అవస్థలను తెలుసుకున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. తక్షణం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఫలితంగా రూ.10లక్షలతో పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణ పనులు చేపట్టారు. ఇవి శరవేగంగా జరుగుతున్నాయి. ఎస్సీ కాలనీలోని ప్రతి వీధిలో పైపులు అమర్చే ప్రక్రియ సాగుతోంది. ఇప్పటికే పలు వీధుల్లో పనులు పూర్తయ్యాయి. బోర్ల నుంచి వచ్చే నీరు వృథా కాకుండా నిల్వ చేసేందుకు ప్రతి వీధిలో ట్యాంకులు నిర్మిస్తున్నారు. త్వరలో పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, కౌన్సిలర్ చాట్ల క్రాంతికుమార్ చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో కాలనీలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు వివరించారు. కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పైపులైన్లు, ట్యాంక్‌ల నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు.



ఎస్సీ కాలనీలో పైపులైన్ వేసేందుకు తెచ్చిన పైపులు



కాలనీలో నిర్మించిన ట్యాంక్

జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ అక్బర్‌కు సన్మానం

కారెంపూడి: పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌గా నియమితులైన షేక్ అక్బర్ జానీబాషాను వైఎస్సార్ సీపీ ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం స్థానిక పద్మావతి శ్రీనివాస కన్వెన్షన్‌లో సన్మానించారు. మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేయడంతోపాటు వారి రాజకీయ ఎదుగుదలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకటరామిరెడ్డి చేయూతనందిస్తున్నారని కారెంపూడి ఉప సర్పంచ్ సూరె అంకారావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ క్రమంలో అక్బర్‌ను పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌గా నియమించి మైనార్టీల ఎదుగుదలకు ప్రభుత్వ విప్ పీఆర్కే చేస్తున్న కృషిని ఆర్యవైశ్య సంఘం పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో గుండా శ్రీనివాసరావు, కరాలపాటి సుబ్బారావు, మిత్తింటి సాంబశివరావు, గుండా నరసింహారావు, కొలిశెట్టి మల్లిఖార్జునరావు, సూరె సుబ్రమణ్యం, దేవరశెట్టి మల్లిఖార్జునరావు, భవిరిశెట్టి రామారావు, లఘువరపు నాగేశ్వరరావు, పొట్టుమూర్తి అమరలింగేశ్వరరావు,ఆతుకూరి గోపి, గుండా హరనాథ్, ఆత్మకూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అక్బర్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని నడికుడి శ్రీపొతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పూజారి సత్తెనపల్లి లక్ష్మాచారి ఆధ్వర్యంలో స్వామి వార్షిక కల్యాణాన్ని నేత్రపర్వంగా జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు వర్రా నాగిరెడ్డి, వర్రా వీరారెడ్డి, వర్రా వెంకటరెడ్డి, పిరిటి రామకృష్ణా, ప్రభాకర్‌రెడ్డి, శౌర్రెడ్డిల పర్యవేక్షణలో స్వామిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. స్వామి తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలను కట్టారు. ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తిరునాళ్ల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సీఐ షేక్ బిలాలుద్దీన్ పర్యవేక్షణలో బందోబస్తును ఏర్పాటు చేశారు.



విద్యుత్ ప్రభ



స్వామి వార్షిక కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

ప్రవీణ్ కుటుంబానికి అండగా ఉంటాం

దుర్గి: రోడ్డు ప్రమాదంలో మరణించిన ప్రవీణ్ కుటుంబానికి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ అన్ని విధాలుగా అండగా ఉంటాయని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(పీవీఆర్) అన్నారు. ఆదివారం అడిగొప్పుల గ్రామంలోని మృతుడి స్వగృహానికి వెళ్ళి మృతదేహానికి పీవీఆర్ నివాళులర్పించారు. అనంతరం పీవీఆర్ మాట్లాడుతూ పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనే అభిమాని ప్రవీణ్‌ను కోల్పోవడం దురదృష్టకరమన్నారు. చిన వయసులోనే ప్రవీణ్ మరణం తనను కలచివేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాలి రామయ్య, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసి షేక్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, జంగా యలమంద, నాదెండ్ల లక్ష్మీనారాయణ, రాయల మధు, రాయపాటి నాగేశ్వరరావు, నాలి శ్రీనివాసరావు, సంక్రాంతి సీతయ్య, మక్కిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రవీణ్‌కు నివాళులర్పిస్తున్న పీవీఆర్